




# కరపత్రం

SINCE 2014

బుధవారం ఆగస్ట్ 19, 2026 | సంపుటి : 2 | సంచిక : 308 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


# 22ఏ నిషేధిత భూములు..

## కట్టుకథలు నమ్మొద్దు: సీఎం రేవంత్

- 22ఏ భూములపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు
- "ప్రైవేటు భూములకు ఇబ్బంది రానివ్వం"
- రెండు రోజుల్లో భూముల పరిశీలన
- ప్రైవేటు భూమి అయితే రిజిస్ట్రేషన్ వెంటనే
- దళారులు, మధ్యవర్తులను నమ్మొద్దు
- "కట్టుకథలు, ఊహాగానాలు నమ్మొద్దు"



హైదరాబాద్:
ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షణకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆస్తులు కలిగిన వారు రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. 22ఏ నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ల అంశంపై ఉన్నతాధికారులతో సీఎం రేవంత్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. రిజిస్ట్రేషన్ల కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ తీసుకున్న వారి ఆస్తులు 22ఏ జాబితాలో ఉంటే రెవెన్యూ అధికారులు రెండు రోజుల్లో పరిశీలిస్తారని సీఎం తెలిపారు. అది ప్రైవేటు భూమి అయితే రిజిస్ట్రేషన్ వెంటనే చేస్తారని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు 22ఏ జాబితా భూములను క్షుణ్ణంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి సరైన జాబితాను రూపొందిస్తారని.. అందులో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని ఆదేశించినట్లు చెప్పారు. ఈ ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలన్నారు. ప్రజలు తమ భూ హక్కుల విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ఆస్తి హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రేవంత్ తెలిపారు. ప్రైవేటుకు సంబంధించి ఒక్క అంగుళం భూమికి కూడా ఇబ్బంది రానివ్వబోమని చెప్పారు. 22ఏ భూముల విషయంలో దళారులు, మధ్యవర్తులను ఆశ్రయించవద్దు.. ఈ విషయంలో ఊహాగానాలు, కట్టు కథలను విశ్వసించవద్దని సీఎం కోరారు.



## ఆసిఫాబాద్‌లో మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే కోవ లక్ష్మి మధ్య వాగ్వాదం

మాట్లాడుతున్న మంత్రి.. అలా అనడం సరికాదంటున్న ఎమ్మెల్యే

ఆసిఫాబాద్:
రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది మాజీ సీఎం కేసీఆర్ అని రాష్ట్ర ఆబ్కారీ శాఖ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. మంగళవారం కుమురంభీం జిల్లా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి పథకంలో కుట్టుమిషన్లు, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండె విఠల్, కలెక్టర్ హరిత, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, హరీశ్‌బాబు, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొని మాట్లాడారు. ఈక్రమంలో మంత్రి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

మిగతాది 2 లో



## వాట్సప్‌లో గంజాయి ఆర్డర్లు.. డ్రగ్స్ ముఠా అరెస్ట్

హైదరాబాద్:
వాట్సప్‌లో గంజాయి ఆర్డర్లు తీసుకుని సప్లై చేస్తున్న ముఠాను తెలంగాణ ఈగల్ పోలీసులు పట్టుకున్నారు. ఒడిశాలో ఐదుగురు డ్రగ్ కింగ్‌పిన్‌లను అరెస్ట్ చేశారు. పోలీసులు ఏకకాలంలో 188 ప్రాంతాల్లో సోదాలు చేశారు.

2 లో



## ఉరికి 40 నిమిషాలు.. ఇంజెక్షన్ ఇవ్వండి: మరణశిక్ష పద్ధతిపై పిటిషన్‌కు సుప్రీం నో

మరణశిక్ష అమలులో ఉరితీయడానికి బదులు ప్రాణాంతక ఇంజెక్షన్ వాడాలని చేసిన అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. మరణశిక్షను అమలు చేసే పద్ధతిగా ప్రస్తుతానికి ఉరితీయడమే కొనసాగుతుందని తాజాగా స్పష్టం చేసింది. దోషికి తక్కువ నొప్పి కలిగించే, వారి గౌరవాన్ని కాపాడే విధంగా ప్రత్యామ్నాయ

## వందేమాతరం.. అప్పుడు బ్రిటీషర్లు.. ఇప్పుడు కాంగ్రెస్ భయపడుతోంది: బండి సంజయ్



హైదరాబాద్:
కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, ఖర్గే తీరుపై ప్రతి భారతీయుడు ఆశ్చర్యానికి లోనవుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. స్వాతంత్ర్య వేడుకల్లో వందేమాతరం ఆలపించకుండా అడ్డుకోవడం దురదృష్టకరమన్నారు. వందేమాతరం ఆలపించడాన్ని చూసి ఒకప్పుడు బ్రిటీష్ వాళ్లు భయపడ్డారని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ భయపడుతోందని ఎద్దేవా చేశారు. బ్రిటీష్ వాళ్లకు, కాంగ్రెస్ నాయకులకు మధ్య తేడా కనిపించడం లేదన్నారు. ఈ దేశంలో కాంగ్రెస్, ఎంఐఎం మాత్రమే వందేమాతరాన్ని వ్యతిరేకిస్తున్నాయని.. ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు.



## వందేమాతరం వివాదంపై భగ్గుమన్న మల్లికార్జున్ ఖర్గే

- » వందేమాతరంపై ఖర్గే ఫైర్!
- » "గాంధీ, నెహ్రూలపై కూడా కేసులు పెట్టండి"
- » సోనియాపై బీజేపీ ఆరోపణలు
- » కాంగ్రెస్ ఖండన.. "గీతాన్ని ఆపలేదు"
- » సోనియా, రాహుల్‌పై పోలీసులకు ఫిర్యాదు
- » గోవాలో తొలి రెండు చరణాలే ఆలాపన

ఢిల్లీ: ఇటీవల కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియాగాంధీ జాతీయగేయం వందేమాతరాన్ని పూర్తిగా ఆలపించకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించారంటూ వివాదం చెలరేగింది. తాజాగా దీనిపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా స్పందించారు. తాము పాడిన వందేమాతరం గతంలో మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి పాడినదేనని ఆయన స్పష్టం చేశారు. అది నేరమైతే మహాత్మా గాంధీ, నెహ్రూలపైనా కేసులు పెట్టాలని సంచలన వ్యాఖ్యలు చేశారు.

2 లో

## చిన్నారెడ్డిపై టీపీసీసీకి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఫిర్యాదు

- » "టికెట్ అమ్ముకున్నా" వ్యాఖ్యలపై ఆగ్రహం
- » చర్యలు తీసుకోవాలని పీసీసీకి విజ్ఞప్తి
- » రికార్డింగ్స్ ఉన్నాయి.. పరిశీలించి చర్యలు
- » ఓటర్ల జాబితాపైనా మహేష్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు
- » 92 లక్షల ఓట్లపై ప్రశ్నార్థకమన్న పీసీసీ చీఫ్



2లో..

హైదరాబాద్:
తనపై ఆరోపణల కారణంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చిన్నారెడ్డిపై టీపీసీసీ ఫిర్యాదు చేశారు ఎమ్మెల్యే మేఘారెడ్డి. చిన్నారెడ్డిపై చర్యలు తీసుకోవాలని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌ను కోరారు మేఘారెడ్డి. తాను టికెట్ అమ్ముకున్నానన్న వ్యాఖ్యలపై పీసీసీకి ఫిర్యాదు చేశారు మేఘారెడ్డి. దీనిపై మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. చిన్నారెడ్డి మాటల రికార్డింగ్స్ ఉన్నాయి. పార్టీ పరిశీలించి చర్యలు తీసుకుంటుంది. క్రమశిక్షణ కమిటీ అన్నీ పరిశీలిస్తోంది' అని తెలిపారు. ఇక తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(సర్)పై మహేష్ గౌడ్ స్పందిస్తూ.. ' మేము ప్రతి ఓటును కాపాడాలని చూస్తున్నాం. EC గైడ్ లైన్స్ తో చాలా నష్టం జరుగుతుంది. తెలంగాణ 3.38 కోట్ల ఓట్లు ఉన్నాయి. ఆధార లేపేరుతో 22% ఓట్లను తొలగించారు.

## జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



జగిత్యాల:
కాంగ్రెస్ అంటే 'రేవంత్ రెడ్డి లిమిటెడ్ కంపెనీ'లా మారిందని బీఆర్ఎస్ నేత జీవన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. 'నేను కూడా జీవన్ రెడ్డిలా తిరగబడతాను'అంటూ కాంగ్రెస్ సీనియర్ నేత, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలపై జీవన్ రెడ్డి స్పందించారు.ఆ పార్టీలో ఒరిజినల్ కాంగ్రెస్ వాళ్లు మిగలకపోవచ్చు. చిన్నారెడ్డిది ధిక్కార స్వరం కాదు.. ఆవేదన అనుకోవాలి. కాంగ్రెస్‌లో డబ్బులిచ్చినవాళ్లకే టికెట్ అన్నట్టు మారింది. కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డి లిమిటెడ్ కంపెనీలా మారింది'అని వ్యాఖ్యానించారు.

## రసాయనాలతో కల్తీ నెయ్యి ..

# 36 టన్నులు స్వాధీనం

- ▪ రసాయనాలతో కల్తీ నెయ్యి!
- ▪ 36 టన్నుల కల్తీ నెయ్యి స్వాధీనం
- ▪ 130 కేంద్రాల్లో అధికారుల తనిఖీలు
- ▪ సింథటిక్ నెయ్యి తయారీ గుట్టురట్టు
- ▪ చౌక పదార్థాలతో నకిలీ నెయ్యి తయారీ
- ▪ రెస్టారెంట్లు, స్వీట్ షాపులకు సరఫరా



2లో..

హైదరాబాద్:
హెచ్-ఫాస్ట్ ఆధ్వర్యంలోని హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్.. ఆహార భద్రతా శాఖతో కలిసి అక్రమంగా కల్తీ నెయ్యి తయారీ,

## భారీగా తగ్గిన చికెన్ ధరలు.. హైదరాబాద్?లో కిలో ధర ఇంత చీప్ అయిందేంటి..?

చికెన్ ధరలు ఇటీవల గణనీయంగా పెరిగాయి. జులై చివరి వారంలో స్కిన్ లెస్ చికెన్ కిలో రూ.280 నుంచి రూ.300 వరకు అమ్మారు. ప్రస్తుతం అదే చికెన్ రూ.220--240 మధ్య లభిస్తోంది. ప్రాంతం, నాణ్యత, కటింగ్ చార్జీలను అనుసరించి ధరల్లో స్వల్ప వ్యత్యాసం ఉంటోంది.



మిగతాది 2లో

## ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో ఎందుకు చేర్చారు?: హరీశ్‌రావు



- ▪ ప్రైవేట్ భూములను 22ఏలో ఎందుకు చేర్చారు?
- ▪ హరీశ్‌రావు ప్రభుత్వంపై ఫైర్
- ▪ లక్షలాది ప్లాట్లు నిషేధిత జాబితాలోకి
- ▪ రిజిస్ట్రేషన్లు లేక యజమానుల ఇబ్బందులు
- ▪ "ప్రభుత్వ తప్పిదానికి ప్రజలను ఎందుకు శిక్షిస్తారు?"
- ▪ అర్హత ఉన్న భూములను 22ఏ నుంచి తొలగించాలని డిమాండ్

2లో..

హైదరాబాద్:
ప్రజల ఆస్తులను ప్రభుత్వ భూములుగా నిర్ధయించి, లక్షలాది ప్లాట్లను నిషేధిత జాబితాలో చేర్చారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆరోపించారు. మల్కాజ్‌గిరిలో పర్యటించిన ఆయన..

# వందేమాతరం వివాదంపై భగ్గుమన్న మల్లికార్జున్ ఖర్గే

మొదటి పేజీ తరువాయి
స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో ఖర్గే జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం వందేమాతరం ఆలాపన జరిగింది. అయితే గాయకులు వందేమాతరంలోని పూర్తి వెర్షన్‌ను ఆలపిస్తుండగా సోనియా గాంధీ ఖర్గే వైపు సైగ చేసి, అనంతరం గాయకులకు కూడా ఏదో చెప్పినట్లు కనిపించిందని బీజేపీ ఆరోపించింది. ఆమె వందేమాతరం పూర్తి ఆలాపనను ఆపించేందుకు ప్రయత్నించారని బీజేపీ నేతలు విమర్శించారు.

అయితే కాంగ్రెస్ ఈ ఆరోపణలను ఖండించింది. ఖర్గే చాలాసేపు నిల్చోవడంతో ఆయనకు కుర్చీ ఏర్పాటు చేయాలని సోనియా గాంధీ నిర్వాహకులకు సైగ చేశారని కాంగ్రెస్ నేత ఉదిత్ రాజ్ తెలిపారు. వందేమాతరం గీతాన్ని ఆపాలని ఆమె ఎలాంటి సూచన చేయలేదని స్పష్టం చేశారు. ఖర్గే ఆరోగ్యం బాగోలేదని, ఎక్కువసేపు నిల్చోలేరని ఆయన పేర్కొన్నారు.

ఈ వ్యవహారంపై సోమవారం సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు నమోదైంది. వందేమాతరం గీతాలాపనను అడ్డుకునేందుకు ఉద్దేశపూర్వకంగా ప్రయత్నించారంటూ వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఫిర్యాదుదారు కోరారు. తాజాగా దీనిపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్రంగా స్పందించారు.

ఖర్గే మాట్లాడుతూ.. "మేము పాడిన వందేమాతరం మహాత్మా గాంధీ పాడినదే. జవహర్‌లాల్ నెహ్రూ పాడినదే. గత 18 ఏళ్లుగా మేము అదే వందేమాతరాన్ని పాడుతున్నాం. వాజ్‌పేయి ప్రభుత్వ హయాంలోనూ ఇదే పాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా 12 ఏళ్లపాటు ఇదే వందేమాతరం పాడారు" అని అన్నారు.

"మేము చేసినదే నేరమైతే.. గత 18 ఏళ్లుగా ఇదే నేరం జరుగుతున్నట్లే. అదే నేరమైతే మహాత్మా గాంధీపై కేసు పెట్టండి. నెహ్రూపైనా కేసు పెట్టండి" అని ఖర్గే వ్యాఖ్యానించారు. జాతీయ గీతాలు, జాతీయ గీతాలాపనకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ అనేక దశాబ్దాల క్రితమే తీర్మానం చేసిందని, ప్రస్తుతం విమర్శలు చేస్తున్న వారిలో చాలామంది పుట్టకముందే కాంగ్రెస్ ఈ అంశంపై నిర్ణయం తీసుకుందని ఆయన పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా, వందేమాతరం వివాదం మరింత ముదిరింది. సోమవారం గోవాలో జరిగిన కాంగ్రెస్ కార్యక్రమంలో ఖర్గే స్వయంగా వందేమాతరాన్ని ఆలపించారు. అయితే ఈసారి గీతంలోని తొలి రెండు చరణాలను మాత్రమే పాడారు. గోవా కాంగ్రెస్ సదస్సు ప్రారంభానికి ముందు ఖర్గేతో పాటు ఇతర కాంగ్రెస్ నేతలు వందేమాతరం ఆలపించారు.

మరోవైపు, ఈ ఏడాది ప్రారంభంలో కేంద్ర ప్రభుత్వం వందేమాతరం గీతాన్ని పూర్తి రూపంలో బహిరంగ సమావేశాలు, పాఠశాలలు, అధికారిక ప్రభుత్వ కార్యక్రమాలు తదితర సందర్భాల్లో ఆలపించడాన్ని తప్పనిసరి చేసింది. అంతేకాకుండా వందేమాతరం ఆలాపనను ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం, అంతరాయం కలిగించడం లేదా నిలిపివేయడం నేరంగా పరిగణించేలా పార్లమెంట్‌లో బిల్లును కూడా ఆమోదించింది.

దీంతో కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన వందేమాతరం ఆలాపనపై బీజేపీ చేసిన ఆరోపణలు, సోనియా గాంధీపై వచ్చిన ఫిర్యాదు, కాంగ్రెస్ ఇచ్చిన వివరణలతో ఈ అంశం రాజకీయంగా మరింత వివాదాస్పదంగా మారింది

# ఉరికి 40 నిమిషాలు.. ఇంజెక్షన్ ఇవ్వండి: మరణశిక్ష పద్ధతిపై పిటిషన్‌కు సుప్రీం నో

మొదటి పేజీ తరువాయి
పద్ధతులను అవలంబించాలని కోరుతూ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. దీనిని తాజాగా ధర్మాసనం కొట్టివేసింది. అలాగే ఇదే అంశంపై గతంలో ఇచ్చిన తీర్పులను విస్తృత ధర్మాసనానికి అప్పగించాలన్న అభ్యర్థనను తిరస్కరించింది.

ఈ పిటిషన్‌ను న్యాయవాది రిషి మల్హోత్రా 2017లో వేశారు. ప్రాణాంతక ఇంజెక్షన్, షూటింగ్, ఎలక్ట్రిక్ షాక్, గ్యాస్ చాంబర్ వంటి పద్ధతుల్లో దోషి కొన్ని నిమిషాల్లో చనిపోతాడని పేర్కొన్నారు. ఉరితీయడం అత్యంత బాధాకరమైన ప్రక్రియ అని, క్రూరమైదని అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం గౌరవప్రదమైన మరణం పొందే హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించాలని కోరారు. ఉరి తీసిన తర్వాత ఆ వ్యక్తి మరణించాడని ప్రకటించడానికి 40 నిమిషాలు పడుతుందని, అదే ఇంజెక్షన్ ద్వారా అయితే ఆ సమయం ఐదు నిమిషాల్లో పూర్తవుతుందని పిటిషన్‌లో పేర్కొన్నారు. సాధ్యమైనంత తక్కువ బాధ కలిగే రీతిలో మరణశిక్షను అమలు చేయాలని ఐరాస తీర్మానం చెబుతోందని గుర్తుచేశారు.

ఈ వాదనలు విన్న సుప్రీంకోర్టు .. తమ తీర్పే అంతిమమైంది కాదని తెలిపింది. మరణశిక్ష అమలుకు ప్రత్యామ్నాయ పద్ధతులపై మెరుగైన శాస్త్రీయ ఆధారాలు ఉన్నట్లయితే.. భవిష్యత్‌లో ఈ అంశాన్ని పరిశీలించవచ్చని పేర్కొంది. ప్రస్తుతానికి కేంద్రం ఉరిశిక్షను కొనసాగించడానికే సుముఖత వ్యక్తం చేసింది. ఉరిశిక్ష లేక ఇంజెక్షన్‌ను ఎంచుకునే అవకాశాన్ని దోషికి ఇవ్వాలని కోర్టు సూచించగా.. అలా చేయడం వల్ల ప్రయోజనం ఉండదని గత విచారణల్లో కేంద్రం వెల్లడించింది.

# రసాయనాలతో కల్తీ నెయ్యి .. 36 టన్నులు స్వాధీనం

మొదటి పేజీ తరువాయి
ఈ తనిఖీల్లో మొత్తంగా 130 సంస్థలను పరిశీలించారు. వీటిలో 39 నెయ్యి తయారీ కేంద్రాలు, 91 నెయ్యి విక్రయ కేంద్రాలు ఉన్నాయి. తనిఖీల్లో పెద్ద ఎత్తున కల్తీ నెయ్యి తయారీ జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. నాణ్యత లేని, నకిలీ పదార్థాలతో పాటు అనుమతి లేని రసాయనాలను కలిపి సింథటిక్ నెయ్యిని తయారు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఈ కల్తీ నెయ్యిని ఆకర్షణీయంగా ప్యాక్ చేసి, బ్రాండ్ల పేరుతో ప్యూర్ దేశీ నెయ్యిగా మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు ఏర్పడుతోందని తెలిపారు.

**◆ 36 టన్నుల కల్తీ పదార్థాలు స్వాధీనం**

ఆహార భద్రతా అధికారులు అక్కడికక్కడే చట్టబద్ధమైన నమూనాలను సేకరించి ప్రయోగశాలల్లో సమగ్ర పరీక్షల కోసం పంపించారు. స్వాధీనం చేసుకున్న మొత్తం నిల్వతో పాటు ఇతర పదార్థాలను తదుపరి చట్టపరమైన చర్యల కోసం ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించారు. ఈ నెయ్యిని ప్రధానంగా దీపం/ పూజా నెయ్యి, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, స్వీట్ తయారీ కేంద్రాలు, ఆయుర్వేద దుకాణాలు వంటి వాటికి మళ్లిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**◆ పలు రాష్ట్రాల నుంచి క్రీమ్ కొనుగోలు**

నెయ్యి తయారీలో ఉపయోగించిన పాల క్రీమ్‌ను మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని సరఫరాదారుల నుంచి కొనుగోలు చేస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. చౌకైన ప్రత్యామ్నాయ పదార్థాలను ఉపయోగించి అత్యంత తక్కువ ఖర్చుతో కల్తీ నెయ్యిని తయారు చేసి, దానిని అసలైన నెయ్యిగా అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. తద్వారా భారీగా అక్రమ లాభాలను ఆర్జిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ ప్రత్యేక తనిఖీల్లో హెచ్-ఫాస్ట్ ఇన్‌స్పెక్టర్లు ఎన్. రంజిత్ కుమార్ గౌడ్, ఎం. అంజయ్య, వారి బృంద సభ్యులు ఎస్ఐలు రమ్య, అభిలాష్, శంకర్, కృష్ణ, అఖిల్ నిర్వహించారు. ఈ మొత్తం ఆపరేషన్ హైదరాబాద్ నగర టాస్క్‌ఫోర్స్ డీసీపీ శ్రీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఐపీఎస్ నేతృత్వంలో జరిపారు.

# చిన్నారెడ్డిపై టీపీసీసీకి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఫిర్యాదు

మొదటి పేజీ తరువాయి
విక్రయ కేంద్రాలపై భారీ స్థాయిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా మొత్తం 36 టన్నుల కల్తీ నెయ్యి, ముడి పదార్థాలు, ప్రమాదకర రసాయన పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.ఓట్ తొలగింపునకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా బాద్యత వహించాలి. బీద ప్రజల ఓట్లు తొలగి పోతున్నాయి. కాంగ్రెస్ దీూా లను 35వేలు మందిని ఇచ్చాం. కానీ జుజ 13వేల 100 మంది అని చూపిస్తున్నారు.

2002లో ఓటు వేసి ఉండాలని కండిషన్ తో చాలా మంది ఎన్యుమరేషన్ ఫామ్ ఇవ్వలేకపోయారు. ఎన్యుమరేషన్ పామ్ ఇవ్వలేదని డిలీట్ చేస్తున్నారు. అన్ మ్యాప్డ్ ఓట్లు 32 లక్షల 37వేలు. డౌట్ ఫుల్ గా ఉన్నాయి 60 లక్షల 50 వేలు ఓట్లు చూపిస్తున్నారు. 92లక్షల ఓట్లు ప్రశ్నార్థకంగా మారాయి. 1.60 కోట్ల ఓట్లకు ఎందుకు క్వచ్చన్ మార్క్ పెట్టారో చెప్పాలి. కాంగ్రెస్ ప్రతి పౌరుడి ఓటు కాపాడాలని ప్రయత్నం చేస్తోంది. తెలంగాణలో ఇంకా టైం ఇవ్వాలి' అని పేర్కొన్నారు.

# ఆసిఫాబాద్‌లో మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే కోవ లక్ష్మి మధ్య వాగ్వాదం

మొదటి పేజీ తరువాయి
మొదట ఎమ్మెల్యే లక్ష్మి మాట్లాడుతూ.. గతంలో రూ.2.50 కోట్లతో సామెల రోడ్డు, రూ.1.50 కోట్లతో పాటగూడ రోడ్డు నిర్మాణాలకు కొబ్బరికాయలు కొట్టినా.. ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదని, మంత్రి చేపట్టిన పనుల పరిస్థితే ఇలా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. మంత్రి మాట్లాడుతూ.. రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను గుడిసెల్లో ఉండే వారికే ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. 2018-23 మధ్య ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఎన్ని ఇళ్లు నిర్మించారని అడగగా.. వాగ్వాదం మొదలైంది. ఇళ్లు నిర్మించకుండా కల్యాణలక్ష్మి, రైతు బంధు వంటి పథకాలు అమలు చేయలేదా? అయినా మంత్రి ఇలా మాట్లాడడం సరికాదని ఎమ్మెల్యే అన్నారు.

మంత్రి మాట్లాడుతూ గతంలో పాలించిన సీఎంలు రూ.65 వేల కోట్ల అప్పు చేస్తే.. పదేళ్ల కాలంలో కేసీఆర్ ఒక్కరే రాష్ట్రాన్ని రూ.8.25 లక్షల అప్పుల్లోకి నెట్టేశారని ఆరోపించారు. వాటికి నెలకు సుమారు రూ.6 వేల కోట్లు చొప్పున ఏడాదికి రూ.70 వేల కోట్ల వరకు వడ్డీ చెల్లించాల్సి వస్తోందన్నారు. తద్వారా రాష్ట్రం అప్పుల కుప్పగా మారి ఖజానా ఖాళీ అయిందని చెప్పారు. దీంతో పనుల్లో కాస్త జాప్యం జరుగుతోందని, త్వరలో అభివృద్ధి పనులు పూర్తిచేస్తామన్నారు.

# పోలీసుల క్రూరత్వాన్ని ప్రశంసించాలా?: రాహుల్ గాంధీ



దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల నిరసనల సమయంలో ఏ ఒక్కరికీ హాని జరగలేదని, వాస్తవానికి దిల్లీ పోలీసులను ప్రశంసించాలంటూ కేంద్రమంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. దేశ విద్యార్థులతో అవాస్తవాలు చెప్పొద్దని.. వారికి కళ్లు, జ్ఞాపకశక్తి ఉన్నాయంటూ 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు.

"దిల్లీ పోలీసులను ప్రశంసించాలని మోదీ ప్రభుత్వంలోని ఒక మంత్రి అంటున్నారు. పార్లమెంటు సమీపంలో శాంతియుతంగా ఉన్న విద్యార్థులపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరిపారు. మేకులతో కూడిన లాఠీలతో కొట్టారు. ఈ క్రూరత్వాన్ని ప్రశంసించాలా? గాయపడిన విద్యార్థులను నేను స్వయంగా కలిశాను. ఏం జరిగిందో దేశమంతా చూసింది. ఇటీవల పార్లమెంటు సమావేశాల సమయంలో కేంద్రమంత్రి అమిత్ షా కనిపించలేదు. ప్రధాని ఇప్పటివరకూ విద్యార్థులకు క్షమాపణ చెప్పలేదు. వారు తమ తప్పులను అంగీకరించరు. దేశ యువతకు అబద్ధాలు చెప్పకండి. వారికి కళ్లతోపాటు జ్ఞాపకశక్తి కూడా ఉంది" అని రాహుల్ విమర్శించారు.

**రిజిజు ఏమన్నారంటే?**

"జంతర్‌మంతర్ వద్ద నిరసనల సమయంలో ఎవరికీ ఏమీ కాలేదు. ఈ ప్రదర్శనలో వేలాది మంది పాల్గొన్నారు. విద్యార్థుల ముసుగులో ఎంతో మంది నేరగాళ్లు చొరబడ్డారు. ఆప్, సమాజ్‌వాదీ పార్టీలకు చెందిన వారు, ఇతరులు కూడా వచ్చి.. హింసను ప్రేరేపించారు. అయినప్పటికీ, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కాంగ్రెస్ హయాంలో జరిగిన ఇలాంటి ఉద్యమాల్లో అనేక మంది మరణించారు. కానీ, దిల్లీలో ఇంతటి భారీ నిరసనల సమయంలోనూ పోలీసులు ఒక్క లాఠీని కూడా ఉపయోగించలేదు. పార్లమెంటు వైపు దూసుకెళ్లినప్పుడు మాత్రమే అడ్డుకున్నారు. ఈ విషయంలో దిల్లీ పోలీసులను ప్రశంసించాలి" అని ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలపై రాహుల్ పైవిధంగా స్పందించారు.

# ఆప్ నేత సత్యేందర్ జైన్ అరెస్టు



ఆమ్‌ఆద్మీ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి సత్యేందర్ జైన్ అరెస్టయ్యారు. దిల్లీ జల్ బోర్డు (డీజేబీ)లో అవినీతికి సంబంధించి గతంలో నమోదైన కేసులో జైన్, బోర్డు మాజీ సీఈవో ఉదిత్ ప్రకాశ్ రాయ్‌తో పాటు ఆరుగురిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. డీజేబీలో ఓ మురుగునీటి శుద్ధి ప్రాజెక్టు టెండరు ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో వీరిని అదుపులోకి తీసుకున్నారు. డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్ ఫిర్యాదుతో 2024 మే నెలలోనే ఈ వ్యవహారంపై కేసు నమోదైంది.ఈ అరెస్టుపై ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. భాజపా ఆదేశాల మేరకే సత్యేందర్ జైన్ అరెస్టు జరిగిందని ఆరోపించారు. ఇలాంటి ధోరణి ఇంకెంతకాలం అని ప్రశ్నించిన కేజ్రీవాల్.. కొద్దిరోజుల కిందే ఆయన్ను జైల్లో పెట్టి ఇబ్బందులు పెట్టిన విషయం అందరికీ గుర్తుందన్నారు. ఈ కేసు కూడా బూటకమని తేలుతుందని, ఆప్‌తోపాటు దేశ ప్రజలు సత్యేందర్ జైన్‌కు మద్దతుగా నిలుస్తారన్నారు.

# ఎన్నికల సంఘం నిర్దాక్షిణ్యంగా ఓట్లు తొలగించింది: మహేశ్‌కుమార్ గౌడ్

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పేరుతో ఎన్నికల సంఘం తెలంగాణలో నిర్దాక్షిణ్యంగా ఓట్లు తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. సర్ ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన నేపథ్యంలో గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడారు."హైదరాబాద్‌లో బీఎల్‌వోలు ఎవరి ఇంటికీ వెళ్లలేదు. పేదలు, వలస కూలీల ఓట్లనే ఎక్కువగా తొలగించారు. 2002 నాటి ఓటర్ల జాబితా ఎంతమందికి అందుబాటులో ఉంది?కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీలాగే ఎన్నికల సంఘాన్ని కూడా తన జేబు సంస్థగా మార్చుకుంది. 2002 నాటి ఓటర్ల జాబితాతో ముడిపెట్టకుండా పౌరులకు ఓటు హక్కు కల్పించాలి. రాష్ట్రంలో అకారణంగా 73 లక్షల ఓట్లను ఎన్నికల సంఘం తొలగించింది. మొత్తంగా 92 లక్షల ఓట్లను ప్రశ్నార్థకం చేసింది. డీలిమిటేషన్, పోలింగ్ కేంద్రాల మార్పు వల్ల 2002 నాటి వివరాలు సరిగా లేవు. లక్షల మంది ఓట్లు తొలగించి ప్రజాస్వామ్య దేశమంటే ఎలా?" అని మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు.

# 600 మంది తొలగింపు.. నాలుగంచెల పరిశీలన.. NTA మరిన్ని చర్యలు




పరీక్షల వ్యవస్థ సమూల ప్రక్షాళనలో భాగంగా జాతీయ పరీక్షల సంస్థ మరిన్ని చర్యలకు సిద్ధమైంది. ప్రశ్నపత్రాలకు సంబంధించి నాలుగు అంచెల పరిశీలన ప్రక్రియ, 600 మంది నిపుణులను తొలగించి.. కొత్తవారిని నియమించడం, సీఐఎస్ఎఫ్ భద్రతతో కూడిన కార్యాలయాల ఏర్పాటు వంటివి ఇందులో ఉన్నాయని కేంద్ర విద్యాశాఖ వెల్లడించింది.

"కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఆదేశాల మేరకు.. పరీక్షల నిర్వహణ బృందంలో సమూల మార్పులకు ఎన్‌టీఏ శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 600 మంది నిపుణులను తొలగించడం, ఆ హోదాల్లో కొత్తవారిని నియమించే ప్రక్రియను చేపట్టింది. పరీక్షా పత్రాల పరిశీలనను మరింత పటిష్ఠం చేసేందుకు గానూ.. నాలుగు అంచెల తనిఖీ విధానాన్ని అమలు చేయనుంది. రాబోయే రెండు మూడు వారాల్లో 20-25 మంది అధికారులను నియమించుకోనుంది. అదేవిధంగా ఎన్‌టీఏ కార్యాలయాలను యుద్ధ ప్రాతిపదికన కొత్త భవనాలకు తరలించి.. సీఐఎస్ఎఫ్ బృందాలతో భద్రతను మరింత కట్టుదిట్టం చేయనుంది" అని కేంద్ర విద్యాశాఖ తెలిపింది.

ప్రశ్నపత్రాల లీకేజీ, పరీక్షల్లో అవకతవకలు బయటపడుతున్న నేపథ్యంలో ఎన్‌టీఏ ఈ తరహా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే 50 మందికిపైగా సిబ్బందిని తొలగించింది. సంస్థలో కీలకమైన 10 స్థానాల్లో నిపుణుల నియామకానికి చర్యలు చేపట్టింది. భవిష్యత్తులో నిర్వహించే అన్ని పరీక్షలను నిష్పక్షపాతంగా, దోషరహితంగా నిర్వహించేందుకు అంతర్గత విధివిధానాలను సమీక్షిస్తున్నట్లు ఎన్‌టీఏ వర్గాలు వెల్లడించాయి.

# ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో ఎందుకు చేర్చారు?: హరీశ్‌రావు

మొదటి పేజీ తరువాయి
భూముల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు చేశారు.ప్రైవేట్ భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడంపై హరీశ్‌రావు మాట్లాడుతూ.. సంబంధిత భూ యజమానుల నుంచి ఎలాంటి దరఖాస్తులు లేకుండానే ప్రైవేట్ భూములను 22ఏలో ఎందుకు చేర్చారని ప్రశ్నించారు. ఇప్పటికే అర్బన్ ల్యాండ్ సీలింగ్ లో పరిష్కారమైన భూములను సైతం నిషేధిత జాబితాలో చేర్చడం వెనుక కారణమేంటని ఆయన నిలదీశారు.

ప్రభుత్వ నిర్ణయాల కారణంగా భూముల యజమానులు తమ ఆస్తులను విక్రయించుకోలేక, రిజిస్ట్రేషన్లు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అలాగే, ప్రజల ఆస్తులపై ప్రభుత్వ తప్పిదాల ప్రభావం పడితే అందుకు బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు.

దీంతో ప్రభుత్వ తప్పిదానికి ప్రజలను ఎందుకు శిక్షిస్తున్నారని వారు నిలదీశారు. అయితే, భూముల రికార్డులను పరిశీలించి, అర్హత ఉన్న ప్రైవేట్ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.

# వాట్సప్‌లో గంజాయి ఆర్డర్లు.. డ్రగ్స్ ముఠా అరెస్ట్

మొదటి పేజీ తరువాయి
పట్టుబడిన గంజాయి వినియోగదారుల్లో ఏడుగురు విద్యార్థులు ఉన్నారు. గంజాయి ఆర్డర్ పెట్టిన వారిలో 100 మందికి డ్రగ్ టెస్టులు చేయగా, 80 మందికి పాజిటివ్‌గా తేలింది. 36 గంటల నాన్‌స్టాప్ ఆపరేషన్‌తో భారీ డ్రగ్ నెట్‌వర్క్‌ను పోలీసులు ఛేదించారు. గంజాయి వినియోగదారులు ఫోన్‌పేలో చెల్లింపులు చేసినట్లు విచారణలో తేలింది. నిందితులు గూగుల్‌మ్యాప్ లోకేషన్ ద్వారా డెడ్‌డ్రాప్ పద్ధతితో డ్రగ్స్ సరఫరా చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల్లో ఓ బాలుడు ఉండడంతో నోటీసులు ఇచ్చారు.

# శంషాబాద్-భోగాపురం విమానానికి బాంబు బెదిరింపు

హైదరాబాద్: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. శంషాబాద్ నుంచి భోగాపురం వెళ్లే విమానానికి బెదిరింపు రావడంతో సీఐఎస్ఎఫ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఎయిర్‌పోర్టులో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. మరోవైపు బాంబు బెదిరింపు మెయిల్‌పై నిఘా వర్గాలు ఆరా తీస్తున్నాయి.



## జిహెచ్ఎంసి అధికారుల షోకాజ్ నోటీస్ ను ధిక్కరించిన ఫలితం

# గుండ్లపోచంపల్లి మహేంద్ర వర్మ ఇల్లు సీజ్

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

- టిగేషన్ చక్రవర్తికి అధికారుల అడ్డు చక్రం
- ప్రజల ఉసురు పోసుకున్న వర్మ ఖర్మ కాలింది
- GHMC యాక్ట్ 1955 సెక్షన్ 461 A ప్రకారం అక్రమ నిర్మాణం సీల్

మేడ్చల్ మండలం గుండ్ల పోచంపల్లిలో సర్వే నంబర్ 210, ప్రధాన రోడ్డులో జరుగుతున్న అక్రమ నిర్మాణం పై జిహెచ్ఎంసి మేడ్చల్ సర్కిల్ ఆఫీసు నుండి గత జులై నెలలో జారీ అయిన షోకాజ్ నోటీసు కు జైత్వాల మహేంద్ర వర్మ అనే వ్యక్తి ఇంకా జవాబు ఇవ్వలేదని సంబంధిత శాఖల సమాచారం.

ఆగస్ట్ 13 వ తేదీన తగిన ఇంటి నిర్మాణ అనుమతి పత్రాలు తీసుకుని హాజరు కావాలని జిహెచ్ఎంసి మేడ్చల్ సర్కిల్ ఆఫీస్ నుండి 30 జూలై 2026 రోజున షోకాజ్ నోటీస్ జారీ అయినప్పటికీ అధికారుల నోటీస్ ను బేఖాతరు చేస్తూ నిర్మాణం పనులు కొనసాగించాడు.

అధికారులు ఈ అక్రమ నిర్మాణాన్ని సందర్శించి పనులు ఆపాలని కోరినా స్లాబ్ వేసాడు.

మహేంద్ర వర్మ ఒక లిటిగేషన్ మనస్తత్వము ఉన్న వ్యక్తి అని, ఇతను అక్రమంగా కోర్టుకు వెళ్లి స్టే ఆర్డర్ తెచ్చుకునే అవకాశముందని గ్రహించి సంబంధిత మూడు కోర్టులలో కేవియట్ పిటిషన్లు దాఖలు చేశానని గుమ్మడి శ్రీనాథ్ మీడియాకు తెలియజేశాడు.

దీనితో మహేంద్ర వర్మ ఏకపక్షంగా కోర్టుకు వెళ్లి ఎలాంటి స్టే ఆర్డర్లు తెచ్చుకునే అవకాశం లేకుండా పోయింది.

ఇక అధికారులను మభ్యపెడుతూ ఉదయము రాత్రి ఎవ్వరూ చూడని సమయంలో దొంగ చాటుగా పనులు చేస్తూ గ్రౌండ్ ఫ్లోర్ లో నాలుగు షాపుల పని పూర్తిచేసి,కిరాయికి ఉన్నామని లివింగ్ ప్రెజెన్స్ చూపెడుతూ థర్డ్ పార్టీ ఇంటరెస్ట్ ద్వారా అక్రమ నిర్మాణం లో తిష్ట వేయాలని మహేంద్ర వర్మ దౌర్జన్యంతో అక్రమంగా పనులు చేస్తున్నాడని అధికారులు గ్రహించారు.

ఇది ఇలా ఉంటే, తను అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి ముందర ఇదివరకు మహేంద్ర వర్మ పెట్టిన TO-LET బోర్డ్ లో మార్పులు చేశాడు.

ఇంటి అక్రమ నిర్మాణం పని ఆపమని జిహెచ్ఎంసి అధికారులు షోకాజ్ నోటీస్ ఇచ్చిన తర్వాత కమర్షియల్ షాప్స్ అని ఉన్నచోట తెల్లని ఫ్లెక్సీ అంటించడం అందరూ గమనించారు.

మహేంద్ర వర్మ చట్ట వ్యతిరేక పనులను ఎప్పటికప్పుడు గమనిస్తున్న జిహెచ్ఎంసి అధికారులు శాఖపరమైన రిపోర్టులను తయారు చేస్తూ వచ్చారు.

ఎన్నిసార్లు చెప్పినా, నోటీసులు ఇచ్చినా అధికారుల ఆదేశాలను ధిక్కరించి పనులు చేస్తున్న మహేంద్ర వర్మ అక్రమ నిర్మాణాన్ని అధికారులు చట్టబద్ధంగా నిలిపివేశారు.

**నిన్న, తేదీ: 18 ఆగస్టు 2026 మంగళవారం రోజు జిహెచ్ఎంసి అధికారులు తమ సిబ్బందితో కలిసి వచ్చి గుండ్ల పోచంపల్లి లో అక్రమ నిర్మాణం చేస్తున్న మహేంద్ర వర్మ కమర్షియల్ ఇంటి నిర్మాణాన్ని సీల్ చేశారు.**




**జిహెచ్ఎంసి సైబరాబాద్ కమిషనరేట్ ఆదేశాలతో,**

జిహెచ్ఎంసి మేడ్చల్ సర్కిల్ కార్యాలయము ద్వారా అధికారులు ఒక ఫ్లెక్స్ ను స్లాబ్ కు వేలాడదీశారు. మరియు సీజర్ నోటీసును అధికారులు ఇంటి ముందర పిల్లర్ కు అంటించారు.

గుండ్లపోచంపల్లి వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణం. గుండ్ల పోచంపల్లి అభివృద్ధికి చేదోడు వాదోడుగా ఎందరెందరో ఎన్నెన్నో నిర్మాణాలు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ భూములు కొని, సంబంధిత ప్రభుత్వ శాఖల వద్ద పర్మిషన్లు తీసుకొని వ్యయ ప్రయాసలకు ఓర్చుకొని నిర్మాణాలు చేస్తున్నారు.

గత మూడు సంవత్సరాల నుండి రియల్ ఎస్టేట్ మార్కెట్ మందకోడిగా సాగుతున్నది.

ఇటువంటి పరిస్థితులలో నిర్మాణాలు చేస్తున్న వారిని, బిల్డర్లను, డెవలపర్లను ఇబ్బంది పెట్టి డబ్బు దండుకోవడానికి దొంగ కేసులు వేసి బ్రతుకుతున్న మహేంద్ర వర్మ వ్యవహారంపై ప్రజలు, బిల్డర్లు ప్రభుత్వ అధికారులు కూడా అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గుండ్లపోచంపల్లి లోని మహేంద్ర వర్మ బాధితులంతా అతడి అక్రమాలను అడ్డుకోవడానికి ఒక్కటయ్యారు.

మహేంద్ర వర్మ అక్రమ ఇంటిని సీల్ చేస్తూ అధికారులు చర్యలు తీసుకోవడం పట్ల గుండ్ల పోచంపల్లి కి చెందిన గుమ్మడి శ్రీనాథ్, వై. శ్రీకాంత్, బైలి రాజేష్,పంపరి సంతోష్, ఇట్టేబోయిన మహేష్, మన్నె ప్రభాకర్ తో పాటు పలువురు సంతోషం వ్యక్తం చేశారు.

**మహేంద్ర వర్మ అక్రమ ఇంటి నిర్మాణాన్ని సీల్ చేసిన జి హెచ్ ఎం సి అధికారులకు అభినందనలు తెలియజేశారు.**

ఇంతే కాకుండా మహేంద్ర వర్మ కడుతున్న అక్రమ నిర్మాణం పై చర్య తీసుకోవాలని, అట్టి అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలని కోరుతూ తెలంగాణ హైకోర్టులో W.P No: 26577/2026 ద్వారా (రిట్ పిటిషన్) కేసు దాఖలు చేశానని శ్రీనాథ్ తెలిపాడు.

గుండ్ల పోచంపల్లి లో మహేంద్ర వర్మ అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి పనులను ఆపి, చట్టబద్ధంగా ఆ నిర్మాణాన్ని తొలగించే వరకు తాను కృషి చేస్తూనే ఉంటానని శ్రీనాథ్ కరపత్రంతో తెలిపాడు.

అమాయకులను హింసించడమే వృత్తిగా పెట్టుకున్న మహేంద్ర వర్మ ఊర్జిత గోల్డెన్ లీఫ్ లే అవుట్ లో రోడ్డు నెంబర్ 2, ప్లాట్ నెంబర్ 8 లో గల అతని ఇల్లు కూడా వివాదంలో చిక్కుకున్నది. డబ్బుకు అవసరమై తన ఇల్లు అమ్మకానికి పెట్టానని చెప్పి, ఇట్యాల దేవరాజం అనే దళితునికి తన ఇల్లు అమ్ముతున్నట్టు విక్రయ ఒప్పంద పత్రము వ్రాసి ఇచ్చి అధిక మొత్తంలో డబ్బులు తీసుకుని ఇల్లు రిజిస్ట్రేషన్ చేయకుండా మహేంద్ర వర్మ ఇబ్బంది పెడుతున్నాడని ఇంటి కొనుగోలుదారుడు ఇట్యాల దేవరాజం మీడియాకు తెలిపారు. మహేంద్ర వర్మ పై చట్టపరమైన చర్యలు తీసుకోబోతున్నానని దేవరాజం మీడియాకు తెలిపారు.

**మొత్తానికి మహేంద్ర వర్మ పాపం పండింది**

- గుండ్లపోచంపల్లిలో నిన్న జిహెచ్ఎంసి అధికారులు సర్వేనెంబర్ 210 లో మహేంద్ర వర్మ నిర్మిస్తున్న అక్రమ ఇంటి నిర్మాణాన్ని సీల్ చేయడం ఒక సంచలనంగా మారింది.

గుండ్ల పోచంపల్లి సహజంగా వికసిస్తున్న పట్టణం.

సహజ అభివృద్ధి చెందుతున్న గుండ్ల పోచంపల్లిలో మహేంద్ర వర్మ లాంటి కొందరు కృత్రిమ వివాదాలు సృష్టించి పట్టణ అభివృద్ధికి అడ్డుపడటం వల్ల ఎందరో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇటువంటి వివాదాల రాయుళ్ల భరతం పట్టడానికి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వము, మరియు ముఖ్య మంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ఎన్నెన్నో కఠిన చర్యలు తీసుకుంటున్నారు.

గుండ్ల పోచంపల్లి లో మహేంద్ర వర్మ లాంటి వ్యక్తుల ఆటలు కట్టించడానికి ప్రభుత్వ అధికారులు రాజకీయ నాయకులు సమిష్టిగా కృషి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల స్వచ్ఛ భారత్




**గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం (NSS) ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. NSS ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాజకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. కళాశాల ప్రాంగణంలో చెత్తాచెదారాన్ని తొలగించి, పరిసరాలను పరిశుభ్రం చేశారు. ప్రిన్సిపాల్ నడికట్ల సందీప్ మాట్లాడుతూ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, డస్ట్‌బిన్లను ఉపయోగించాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు.

## పురుగుల మందు తాగిన విద్యార్థిని సిరిపూర్ లో విషాదం



**గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిరిపూర్ గ్రామానికి చెందిన నునావత్ శృతిక (17) అనే విద్యార్థిని మంగళవారం పురుగుల మందు తాగి మృతి చెందింది. పోలాస అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కాలేజీలో డిప్లమా రెండవ సంవత్సరం చదువుతున్న శృతిక, గతంలో ప్రేమించిన వ్యక్తిపై కుటుంబ సభ్యులు కేసు పెట్టడంతో మనస్తాపానికి గురైంది. ఆగస్టు 17న తండ్రి నునావత్ తిరుపతి కుమార్తెను చూడటానికి కళాశాలకు వెళ్లగా, శృతిక పురుగుల మందు తాగిందని తెలిసింది. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించినా, చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# సీఎం సహాయక నిధి చెక్కుల పంపిణీ..

## పేద కుటుంబాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు లబ్ధిదారులకు చెక్కుల అందజేత
- 60వ డివిజన్ అధ్యక్షులు ఎనుకొంటి పున్నం చందర్, 4వ డివిజన్ అధ్యక్షులు ఆంజనేయులు

**కరపత్రం ప్రతినిధి హనుమకొండ, ఆగస్టు 18**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయక నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం హనుమకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 60వ డివిజన్ అధ్యక్షులు ఎనుకొంటి పున్నం చందర్, 4వ డివిజన్ అధ్యక్షులు ఆంజనేయులు పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు ఆపదలో ఉన్న సమయంలో వారికి తక్షణ ఆర్థిక



సహాయం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయక నిధి ఎంతో ఉపయోగపడుతోందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య చికిత్సలు, అత్యవసర పరిస్థితుల్లో ఈ నిధి ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సహాయం ఎన్నో కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడంలో ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ వాటిని వినియోగించుకోవాలని వారు సూచించారు. ప్రజలకు సేవ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, భవిష్యత్తులో కూడా సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీధర్, లబ్ధిదారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# 2027 జనగణనలో బీసీ ఉపకులాలకు ప్రత్యేక కోడ్ కేటాయించాలి

- ఉపకులాల వారీగా జనాభా నమోదు ద్వారానే సామాజిక న్యాయం సాధ్యం: బీసీ మేధావుల వేదిక

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 18**

2027లో నిర్వహించనున్న జాతీయ జనగణనలో వెనుకబడిన తరగతుల (బీసీ) జనాభాను మాత్రమే కాకుండా, ప్రతి బీసీ ఉపకులానికి ప్రత్యేక ఉపకుల సంకేతం కేటాయించి వారి జనాభా వివరాలను నమోదు చేయాలని బీసీ మేధావుల వేదిక (బీసీఐఎఫ్) వరంగల్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఉపకులాల వారీగా ఖచ్చితమైన జనాభా లెక్కలు అందుబాటులోకి వస్తేనే విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమ పథకాలు, బడ్జెట్ కేటాయింపులు, రిజర్వేషన్ల అమలులో నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని పేర్కొంది.

దేశంలో బీసీ వర్గాలు అనేక ఉపకులాలుగా విభజించబడి



ఉన్నప్పటికీ, ఇప్పటి వరకు ఉపకులాల వారీగా అధికారిక జనాభా గణాంకాలు లేకపోవడం వల్ల అనేక వర్గాలు అభివృద్ధి ఫలాలకు దూరమవుతున్నాయని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా ఆధారిత విధానాలు రూపొందించాలంటే ప్రతి ఉపకులానికి ప్రత్యేక గుర్తింపు కల్పించి, జనగణనలో వారి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా బీసీ మేధావుల వేదిక నాయకులు ప్రొఫెసర్ బెనర్జీ, డాక్టర్ కె. వీరస్వామి, మండల పరశురాములు, ధర్మపురి రాజగోవిందు మాట్లాడుతూ, జనాభా లెక్కల ఆధారంగానే ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాలు రూపొందిస్తాయని, అందువల్ల బీసీ ఉపకులాల ఖచ్చితమైన గణాంకాలు వెలుగులోకి రావడం అత్యంత అవసరమన్నారు. ఉపకులాల జనాభా వివరాలు నమోదు చేయడం ద్వారా వెనుకబడిన వర్గాల అసలు పరిస్థితి ప్రభుత్వాలకు తెలుస్తుందని, తద్వారా సమాన అవకాశాలు కల్పించే విధానాలకు బలం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. అదే విధంగా, 2027 జనగణనను సామాజిక న్యాయానికి పునాది వేసే విధంగా నిర్వహించాలని, బీసీ ఉపకులాల వారీగా ప్రత్యేక సంకేతాలు కేటాయించి సమగ్ర సమాచారం సేకరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని బీసీ మేధావుల వేదిక విజ్ఞప్తి చేసింది.

## వెల్లుల్ల జడ్పిహెచ్ స్కూల్లో భోజనం తనిఖీ

## భోజనం చేసిన సర్పంచ్ తదితరులు

**గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామంలోని జడ్పిహెచ్ స్కూల్ లో మంగళవారం సర్పంచ్ గూడూరు తిరుపతి, హెచ్ఎం గడ్డం శ్రీనివాస్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ అంజిత్ రెడ్డి, జిపిఓలు నాగరాణి, రాజేశం, ఏఎన్ఎం సువర్ణ, వార్డ్ సభ్యులు, ఉపాధ్యాయులు పిల్లలతో కలిసి భోజనం చేశారు. మాంసాహారం, శాఖాహారం, గుడ్లు, పాలు, అల్పాహారం, భోజనం గురించి పిల్లలను అడిగి తెలుసుకున్నారు. కూరగాయలు, బియ్యం, పప్పులు, వంటనూనె, వంట సామాగ్రిని తనిఖీ చేశారు.



కరపత్రం తెలుగు దిన పత్రిక

బుధవారం ఆగస్ట్ 19, 2026

# పేదలకు ‘భూలక్ష్మి’ పథకంతో ఎకరం భూమి పంపిణీ చేస్తాం: టిఆర్‌ఎస్ చీఫ్ కవిత

- సామాజిక న్యాయం కోసం భూ పునఃపంపిణీ తప్పనిసరి
- పేదల భూములను లాక్కుంటే సహించేది లేదని ప్రభుత్వానికి హెచ్చరిక
- అధికారంలోకి వస్తే భూమి పంపిణీపై తొలి ప్రాధాన్యం ఇస్తామని ప్రకటన




**కరపత్రం ప్రతినిది బ్యూరో, ఆగస్టు 18**

రాష్ట్రంలో నిజమైన సామాజిక న్యాయం అమలు కావాలంటే మరోసారి భూ పంపిణీ చేపట్టాల్సిన అవసరం ఉందని, అధికారంలోకి వచ్చిన వెంటనే ‘భూలక్ష్మి’ పథకం ద్వారా ప్రతి పేద కుటుంబానికి ఎకరం భూమి పంపిణీ చేస్తామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. పేదల భూములను కాపాడేందుకు తమ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని ఆమె స్పష్టం చేశారు. సామాజిక న్యాయ సంకల్ప సభ నిర్వహించిన తర్వాతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక న్యాయం గురించి మాట్లాడడం ప్రారంభించారని కవిత పేర్కొన్నారు. అయితే మాటల్లో సామాజిక న్యాయం చెబుతున్న ప్రభుత్వం, చేతల్లో మాత్రం బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు, మహిళల పట్ల వివక్ష చూపుతోందని విమర్శించారు. మంత్రి వర్గంలో బీసీలకు తగిన ప్రాధాన్యం లేదని, కీలక పదవులు కూడా ప్రధానంగా అగ్రవర్ణాలకే కట్టబెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రస్తుతం “రేవంత్ రాక్షస రాజ్యం (ఆర్‌ఆర్‌ఆర్)” కొనసాగుతోందని, ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులే భూ దోపిడీకి పాల్పడుతున్నారని ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. పరిశ్రమల పేరుతో పేదల అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకుంటున్నారని, గత రెండేళ్లలో వేలాది ఎకరాల భూములు పేదల నుంచి లాక్కున్నారని పేర్కొన్నారు. ధరణి, భూభారతి వ్యవస్థలతో పాటు 22-ఏ నిబంధనను కూడా భూ దోపిడీకి వినియోగిస్తున్నారని విమర్శించారు. బీసీల అభివృద్ధి పేరుతో ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రకటనలు చేస్తున్నప్పటికీ, బడ్జెట్‌లో వారికి కేటాయిస్తున్న నిధులు చాలా తక్కువగా ఉన్నాయని కవిత అన్నారు. మహిళలకు, మైనార్టీలకు, వెనుకబడిన వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. యాదాద్రి, చిత్రపురి కాలనీ, ఆర్టీఐ కమిషనర్ల నియామకాలు వంటి అంశాలను ప్రస్తావిస్తూ సామాజిక న్యాయం కేవలం ప్రచారానికే పరిమితమైందని విమర్శించారు. తెలంగాణలో ప్రభుత్వ భూములు, భూదాన్ భూములు, ఇతర అందుబాటులో ఉన్న భూములను సమీక్షిస్తే ప్రతి పేద కుటుంబానికి ఎకరం భూమి ఇవ్వడం సాధ్యమేనని కవిత పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడితే ‘భూలక్ష్మి’ పథకం ద్వారా ప్రతి అర్హ కుటుంబానికి ఎకరం భూమి పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. భూమి అనేది పేదలకు జీవనాధారం, గౌరవానికి ప్రతీక అని, పేదల భూములను లాక్కునే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. సామాజిక న్యాయం నిజంగా అమలు కావాలంటే భూ పునఃపంపిణీతో పాటు వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాల్సిందేనని, పేదల హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ రక్షణ సేన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని కవిత వెల్లడించారు.

# మైనారిటీల సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

- స్టేషన్ ఘనపూర్‌లో 100 మంది మహిళలకు 100 శాతం సబ్సిడీతో కుట్టు మిషన్ల పంపిణీ
- స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధించాలి – – ఎమ్మెల్యే కడియం శ్రీహరి






**కరపత్రం ప్రతినిది స్టేషన్ ఘనపూర్, ఆగస్టు 18**

మైనారిటీల సంక్షేమం, మహిళల ఆర్థిక సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. పేద కుటుంబాల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, మైనారిటీల అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం స్టేషన్ ఘనపూర్ పట్టణంలోని రైతు వేదికలో మైనారిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి పథకం కింద కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన 100 మంది నిరుపేద మైనారిటీ మహిళలకు 100 శాతం సబ్సిడీతో మంజూరైన కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం శిక్షణతో పాటు పూర్తి సబ్సిడీపై కుట్టు మిషన్లను అందిస్తోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని లబ్ధిదారులకు సూచించారు.

**▪ యూనిఫాం కుట్టే అవకాశాలు కల్పిస్తాం**

కుట్టు మిషన్లు అందుకున్న మహిళలకు భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫామ్‌ల కుట్టు పనులు లభించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. దీంతో మహిళలకు స్థిరమైన ఉపాధి, ఆదాయం లభించే అవకాశం ఉంటుందని తెలిపారు.

**▪ మైనారిటీల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు**

కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీల విద్య, ఉపాధి, స్వయం ఉపాధి రంగాలకు విశేష ప్రాధాన్యత ఇస్తోందని కడియం శ్రీహరి అన్నారు. విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం చేయాలనుకునే విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు, ప్రతి నియోజకవర్గంలో బాలికలు, బాలుర కోసం మైనారిటీ గురుకుల పాఠశాలలు, ఆధునిక వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే నిరుద్యోగ మైనారిటీ యువతకు మైనారిటీ కార్పొరేషన్ ద్వారా రూ. 50 వేల వరకు 100 శాతం సబ్సిడీతో రుణాలు, రూ. 1 లక్ష నుంచి రూ. 5 లక్షల వరకు బ్యాంక్ లింకేజ్ రుణాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, ఉపాధి పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

**▪ ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు భరోసా**

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఇల్లు లేని నిరుపేద మైనారిటీ కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గృహాలను మంజూరు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు.

**▪ మత సామరస్యానికి కాంగ్రెస్ కట్టుబాటు**

దేశంలో మత సామరస్యం, లౌకిక విలువల పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని కడియం శ్రీహరి స్పష్టం చేశారు. హిందూ, ముస్లిం ప్రజలందరూ పరస్పర సోదరభావంతో కలిసి మెలిసి జీవించాలని పిలుపునిచ్చారు. మైనారిటీల పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వివక్ష చూపుతోందని విమర్శిస్తూ, కాంగ్రెస్ మాత్రం అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించే దిశగా పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, మైనారిటీ కార్పొరేషన్ అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# విగ్రహాలతో పాటు.. బీసీల సంక్షేమానికీ ప్రాధాన్యం: గుజ్జ సత్యం

- మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టడమే వారికి నిజమైన నివాళి
- బీసీ విద్యార్థుల భవిష్యత్తు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి: గుజ్జ సత్యం



**కరపత్రం ప్రతినిది స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఆగష్టు 18:**

మహనీయుల విగ్రహాల ఏర్పాటుతో పాటు వారి ఆశయాలకు అనుగుణంగా బీసీల సంక్షేమం, విద్య, ఉపాధి, ఆర్థిక సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం కోరారు. మహాత్మా జ్యోతిరావు పూలే, సర్వాయి పాపన్న గౌడ్ వంటి మహనీయులు చూపిన సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, సమానత్వ మార్గంలో ప్రభుత్వం మరింత కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

ఎల్బీనగర్‌లో నిర్వహించిన సర్వాయి పాపన్న గౌడ్ జయంతోత్సవాల కార్యక్రమంలో గుజ్జ సత్యం పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన వర్గాల ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం కోసం పోరాడిన గొప్ప యోధుడని పేర్కొన్నారు. ఆయన చరిత్రను భావితరాలకు తెలియజేయడంతో పాటు, పాపన్న గౌడ్ ఆశయాలను సమాజంలో ఆచరణలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

“మహనీయుల విగ్రహాలు మన చరిత్రను, వారి పోరాట స్ఫూర్తిని భావితరాలకు గుర్తుచేస్తాయి. అదే స్ఫూర్తితో బీసీ విద్యార్థులకు మెరుగైన విద్య, యువతకు ఉపాధి, పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే విధానాలు మరింత బలోపేతం కావాలి” అని గుజ్జ సత్యం అన్నారు.

బీసీ విద్యార్థుల ఉన్నత విద్యకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు కీలకమని పేర్కొన్న ఆయన.. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. బీసీ సంక్షేమానికి బడ్జెట్‌లో కేటాయింపులతో పాటు నిధుల సకాలంలో విడుదల, సమర్థ వినియోగంపైనా దృష్టి పెట్టాలని సూచించారు.

“సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళి అంటే ఆయన విగ్రహానికి పూలమాల వేయడంతో పాటు ఆయన ఆశించిన ఆత్మగౌరవం, సమానత్వం బీసీల జీవితాల్లో ప్రతిఫలించేలా చర్యలు తీసుకోవడం. బీసీ యువత విద్య, ఉపాధి, ఆర్థిక ప్రగతిలో ముందుకు సాగినప్పుడే మహనీయుల ఆశయాలకు నిజమైన గౌరవం లభిస్తుంది” అని గుజ్జ సత్యం పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మ రఘురామ్‌నేత, సోషల్ జస్టిస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.వి. గౌడ్, బీసీ నాయకుడు జిల్లా నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్ది విగ్రహం తొలగింపు బాధాకరం.. కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలి: నన్నపునేని నరేందర్





**కరపత్రం ప్రతినిది వరంగల్ తూర్పు, ఆగస్టు 18**

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించడం బాధాకరమని వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నరేందర్ మాట్లాడుతూ.. మృతుడిపై కక్ష సాధింపు చర్యలు సరికాదని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజల మనోభావాలను గౌరవించకుండా విగ్రహాన్ని తొలగించడం సరైన నిర్ణయం కాదన్నారు. విగ్రహం తొలగిస్తే నియోజకవర్గంలోని ప్రతి మండలం, ప్రతి గ్రామంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని తెలిపారు.

బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి అనుమతి ఇచ్చి, తెలంగాణ కోసం పోరాడిన పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించడం ఏ న్యాయమని ప్రశ్నించారు. పెద్ది కుటుంబంపై ప్రభుత్వం వివక్ష చూపుతోందని, తన 33 ఏళ్ల రాజకీయ జీవితంలో మృతుడిపై ఇలాంటి కక్ష సాధింపు చర్యలు చూడలేదన్నారు. పాఖాల ప్రాంతానికి గోదావరి జలాలు తీసుకురావడంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఆయన మరణానంతరం విగ్రహాన్ని తొలగించి కుటుంబ సభ్యులకు మరింత వేదన కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో విగ్రహం ఏర్పాటు చేసిన అనంతరం తనపై కేసు నమోదు చేశారని, స్థానికంగా ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో పోలీసు కానిస్టేబుల్ ద్వారా కేసు పెట్టించారని ఆరోపించారు. అధికార బలంతో పోలీసులు, అధికారులను అడ్డుపెట్టుకుని విగ్రహాన్ని తొలగించారని విమర్శించారు.

పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆశయాలను ప్రజలే ముందుకు తీసుకెళ్తారని, రానున్న ఎన్నికల్లో ప్రజలు తమ ఆగ్రహాన్ని ఓటు రూపంలో చూపిస్తారని పేర్కొన్నారు. విగ్రహం తొలగింపు వ్యవహారంపై ప్రభుత్వం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జానకిపురంలో పరామర్శలు.. బాధిత కుటుంబాలకు కడియం శ్రీహరి భరోసా

- పొట్ల సుదేశ్ల దేవి మృతికి సంతాపం.. మాజీ సర్పంచ్ రామ్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై ఆరా





**కరపత్రం ప్రతినిది ధర్మసాగర్, ఆగస్టు 18**

ధర్మసాగర్ మండలం జానకిపురం గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ పొట్ల రవి మోహన్‌రెడ్డి తల్లి పొట్ల సుదేశ్ల దేవి (78) అనారోగ్యంతో మృతి చెందడంతో స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. మంగళవారం జానకిపురం గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే సుదేశ్ల దేవి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా సుదేశ్ల దేవి మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం కల్పించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పొట్ల రామ్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆయనను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గతంలో రామ్‌రెడ్డితో తనకు ఉన్న అనుబంధాన్ని, ఆయనతో కలిసి పనిచేసిన సందర్భాలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తుచేసుకున్నారు.

ఎమ్మెల్యే వెంట జానకిపురం సర్పంచ్ జగన్‌మోహన్‌రెడ్డి, ధర్మసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెసరు రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బిర్లా ఓపెన్ మైండ్స్ లో విద్యార్థుల భవిష్యత్తుకు దిశానిర్దేశం

- నిపుణుల సూచనలు -- ఉన్నత విద్య, పోటీ పరీక్షలపై సమగ్ర అవగాహన
- ఎన్ఐటీ మాజీ ప్రొఫెసర్ దంతాల దినకర్ విలువైన సూచనలు
- బిర్లా ఓపెన్ మైండ్స్ లో స్ఫూర్తిదాయక కెరీర్ గైడెన్స్ కార్యక్రమం
- బిర్లా విద్యాసంస్థల చైర్మన్ లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో..





**కరపత్రం ప్రతినిది బ్యూరో, ఆగస్టు 18**

నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ప్రముఖ విద్యావేత్తలు సూచించారు. ఈ నేపథ్యంలో బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో సీనియర్ సెకండరీ విద్యార్థుల కోసం ప్రత్యేక కెరీర్ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని పాఠశాల చైర్మన్ లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్ఐటీ వరంగల్ రిటైర్డ్ సీనియర్ ఫిజిక్స్ ప్రొఫెసర్ దంతాల దినకర్ ముఖ్య వక్తగా హాజరై విద్యార్థులకు ఉన్నత విద్య, పోటీ పరీక్షలు, దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశ అవకాశాలు, వివిధ కోర్సుల ఎంపిక, కెరీర్ ప్రణాళికపై సమగ్ర అవగాహన కల్పించారు.

సమయపాలన, క్రమశిక్షణ, నిరంతర కృషి, పట్టుదల విజయానికి మూలాధారాలని పేర్కొన్న ఆయన, వైఫల్యాలను విజయానికి సోపానాలుగా మలచుకోవాలని సూచించారు. ప్రముఖ విద్యాసంస్థల్లో చదవడం ద్వారా లభించే క్యాంపస్ ప్లేస్‌మెంట్లు, ఉద్యోగ అవకాశాలు, భవిష్యత్ కెరీర్‌లో కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం ఫిజిక్స్‌లోని కీలక అంశాలను సులభంగా వివరించి విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించారు. కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభిప్రాయపడ్డారు.

## నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సమీక్ష




**కరపత్రం ప్రతినిది వరంగల్,ఆగస్టు 18**

వరంగల్: వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు,రిటైర్డ్ ఐపీఎస్ అధికారి మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,ఐఏఎస్‌తో కలిసి నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు.నియోజకవర్గంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతి,పెండింగ్‌లో ఉన్న పనులు,ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ఎమ్మెల్యే అధికారులతో చర్చించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి,అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలని సూచించారు.అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.సమావేశంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ)జి.సంధ్యారాణి,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి నగర్ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ,

ప్రగతి నగర్ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ, వర్షాకాల ముందస్తు చర్యలు ప్రజలకు సంబంధించిన మౌలిక వసతుల సమస్యల పరిష్కారంపై అధికారులు ఈరోజు క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పరిశీలించారు ఈ సందర్భంగా పంచవటి పార్క్, చందు లేఅవుట్‌లో కొనసాగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు పంచవటి పార్క్‌లో జరుగుతున్న కలుపు మొక్కల తొలగింపు, శుభ్రపరిచే పనులను కూడా పరిశీలించి పార్క్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు చందు లేఅవుట్‌లో డ్రైనేజీ సమస్యలు, గుంతలు మరియు వర్షపు నీరు నిలిచే ప్రాంతాలను పరిశీలించారు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు వర్షాకాలంలో దోమల ద్వారా వ్యాపించే సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా పంచవటి పార్క్ మరియు చందు లేఅవుట్‌లో యాంటీ-లార్వల్ స్ప్రేయింగ్ కార్యక్రమాలను పరిశీలించారు దోమల వృద్ధికి అవకాశం ఉన్న ప్రాంతాల్లో నిరంతరం యాంటీ-లార్వల్ చర్యలు చేపట్టాలని సూచించారు